
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
శుక్రవారం 20 సెప్టెంబరు 2024



రోగమొస్తే.. రోదనే!

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి నిర్వహణ అధ్వానం



- తీరు మారకపోవడంతో ప్రజల ఇబ్బందులు
- ఫార్మసీలో మందుల కొరత
- పెయిన్ కిల్లర్, విటమిన్ టాబ్లెట్లూ కరువే..
- కిట్లు, కెమికల్స్ లేక పలు నిర్ధారణ పరీక్షలకు బ్రేక్
- బ్లడ్ కంటెయినర్స్ లేవంటూ టెస్టులు చేయని సిబ్బంది
- రాత్రివేళ ఆపరేటర్లు లేక నిలిచిపోతున్న ఎక్స్‌రే, స్కానింగ్
- కిడ్నీవ్యాధిగ్రస్థులకు తప్పని డయాలసిస్ కష్టాలు
- పేద బతుకులకు పరీక్ష పెడుతున్న సర్కారు దవాఖానా
- ఎంజీఎం సమస్యలపై దృష్టిపెట్టని మంత్రులు, ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పాలకులు మారుతున్నా.. సర్కారు ఆస్పత్రుల్లో సమస్యలు మాత్రం తీరటం లేదు. వైద్యరంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. ఉత్తర తెలంగాణకే పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ ఆస్పత్రి(ఎంజీఎం)లో వైద్య సేవలు మెరుగు పడటం లేదు. పలు ఆరోగ్య సమస్యలతో ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని వచ్చే రోగులకు ఆస్పత్రిలో అగచాట్లే ఎదువుతున్నాయి. ఉచిత మందులు, వైద్య పరీక్షలన్నీ ఉత్తమాటలుగా మిగులుతున్నాయి. టెస్టులకు కిట్లుండవు.. ఫార్మసీల్లో మందులుండవు. సూది మందు నుంచి సెలైన్ వరకు అన్ని బయట కొనాల్సిందే. రాత్రివేళ జన్మించే పిల్లలకు ఎక్స్‌రేలు తీసేందుకు ఆపరేటర్లు అదుబాటులో ఉండరు. కార్డియలాజీ, న్యూరో, డెంటల్, ఈఎన్‌టీ తదితర విభాగాల్లో పూర్తిస్థాయిలో వైద్యులు కరువు. గత ప్రభుత్వమే పేదల దవాఖానాను గాలికి వదిలేసిందని భావిస్తున్న ప్రజలకు కాంగ్రెస్ సర్కారు కూడా అదేబాటలో నడుస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రక్త పరీక్షలకు కిట్ల కొరత

ఉత్తర తెలంగాణలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రిగా ఉన్న వరంగల్‌లోని ఎంజీఎంకు ఉమ్మడి వరంగల్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల నుంచి వైద్య పరీక్షల కోసం ప్రజలు వస్తుంటారు. ఈ క్రమంలో నిత్యం సుమారు నాలుగైదు వేల మందికి పైగా ఓపీ, ఐపీ సేవలు పొందుతున్నారు. ఎంజీఎం ఆస్పత్రితో పాటు అనుబంధంగా ఏర్పాటు చేసిన కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలోని 21 విభాగాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అయితే తాజాగా వరంగల్ ఎంజీఎంలో రక్త పరీక్షలకు కొరతొచ్చింది. ఎన్నడూ లేని విధంగా గురువారం ఎంజీఎం ల్యాబ్‌లో బ్లడ్ కంటైనర్స్ లేవని రక్త పరీక్షలు నిర్వహించకపోవడంతో రోగులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రైవేటు ల్యాబ్‌లకు పరుగులు పెట్టాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు. ఏ వైద్యం చేయాలన్నా మొదటి బ్లడ్ టెస్ట్ చేయాలని వైద్యులు సూచిస్తారు. అలాంటి బ్లడ్ టెస్టులు ఎంజీఎంలో కరువవ్వటంతో రోగుల బాధలు వర్ణణాతీతంగా మారుతున్నాయి. అలాగే థైరాయిడ్, షుగర్, హెచ్‌ఐవీ, క్యాన్సర్ తదితర వాటి కోసం బయో కెమిస్ట్రీ, మైక్రో కెమిస్ట్రీ టెస్టులు చేసేందుకు ల్యాబరేటరీల్లో కెమికల్స్ ఎప్పుడు అందుబాటులో ఉంటాయో.. ఎప్పుడు ఉండవో ఆ దేవుడికే తెలియాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అత్యవసర పరీక్షల కోసం వచ్చే రోగులను ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపిస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. గుండె జబ్బులకు సంబంధించి నిర్వహించే టూడీ ఎకో పరీక్షలు కూడా భారంగా మారాయి. ఒక్కో సారి టెక్నీషియన్లు లేరని రోగులును ప్రవేటు ఆస్పత్రులకు పంపించిన సందర్భాలున్నాయి. ఇన్ఫ్రాస్ట్రక్చర్ పాడైపోతున్న పట్టించుకునే వారు కరువయ్యారు. గ్యాస్ట్రో డిపార్ట్‌మెంట్‌లో కొలనోస్కోపీ, ఎండో స్కోపీ యంత్రాలు పాడై పనికి రాకుండా పోవటంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. ఇక రాత్రిపూట డెలవరీ అయిన తరువాత అప్పుడే పుట్టిన బిడ్డలో కొన్ని సమస్యలు ఉత్పన్నమవ్వటం సాధారణమే. అయితే బిడ్డలో ఏ సమస్య ఉందో తెలుసుకునేందుకు అప్పుడప్పుడు వైద్యులు ఎక్స్‌రే, స్కానింగ్‌కు రిఫర్ చేస్తారు. కానీ రాత్రిపూట ఎక్స్‌రే, స్కానింగ్ విభాగాల్లో సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం బాధితులకు నరకయాతనగా మారతోంది. దాంతో తెల్లవారుజామున సిబ్బంది వచ్చే వరకు ఎదురు చూడాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. బిడ్డ సమస్య తీవ్రంగా ఉంటే అర్ధరాత్రి వేళ ప్రైవేటు ఎక్స్‌రేలు, స్కానింగ్ సెంటర్లకు వెళ్లి డబ్బులు చెల్లించి చేయించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంజీఎంలో తరుచుగా డయాగ్నస్టిక్ సెంటర్‌లో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈసీజీ విభాగంలో తగిన సంఖ్యలో మహిళ సిబ్బంది లేకపోవటంతో ఈసీజీలను తీయడానికి సమస్యలు ఎదురవుతున్నాయి. టెక్నీషియన్ల కొరతతో కిడ్నివ్యాధిగ్రస్థులు డయాలసీస్ కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని వాపోతున్నారు. తరచూ కంప్లీట్ బ్లడ్ కౌంట్(సీబీసీ) మెషిన్ మరమ్మతులకు గురవుతుండటంతో బాధితులను ప్రైవేట్‌కు రిఫర్ చేస్తున్న సంఘటనలు ఇటీవలకాలంలో వెలుగు చూస్తున్నాయి.





మందు గోళీలు కరువాయే..

ఎంజీఎం ఆస్పత్రిలో మందు గోళీల కొరత కొనసాగుతూనే ఉంది. కొన్నాళ్లుగా ఎంజీఎం ఫార్మసీలో సరిపడా మందులు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో ఉండే పీహెచ్‌సీల్లో లభ్యమయ్యే విటమిన్, పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్లు కూడా ఎంజీఎం ఫార్మసిలో లభ్యం కావటం లేదు. ఆస్పత్రిలో వివిధ సర్జరీల తరువాత నొప్పి బాధ తెలియకుండా ఉండేందుకు వైద్యులు పెయిన్ కిల్లర్ టాబ్లెట్లు వాడమంటారు. అయితే ఫార్మసిల్లో ఈ టాబ్లెట్ల కృత్రిమ కొరతను సృష్టించి ప్రైవేటు మెడికల్ షాపులకు గిరాకీ పెరిగేలా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటనలో రోగుల నుంచి ఫిర్యాదులు రావటంతో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను ఫార్మసిని తనిఖీ చేసి, వాస్తవాలను నివేదిక రూపంలో ఇవ్వమని మంత్రి కోరారు. దీంతో డాక్టర్ కడియం కావ్య ఎంజీఎం ఫార్మసీని పరిశీలించి అవాక్కయ్యారు. పీహెచ్‌సీల్లో లభించే మందులు కూడా ఎంజీఎంలో అందుబాటులో లేకపోవటం పట్ల ఎంపీ విస్మయం వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వానికి ఎంపీ నివేదికను అందిచినట్టు సమాచారం. కాగా, ఎంజీఎంలో సుమారు 200రకాలకు పైగా మందులు అందుబాటులో ఉండాల్సి ఉంది. అయితే కొన్ని సాధారణ రకాల మందులు మాత్రమే ఎంజీఎం ఔషధ షాపుల్లో ఇస్తున్నారు. మిగతా మందుల కోసం బయట ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. దీంతో వేలాది రూపాయలు మందులకే ఖర్చు అవుతున్నాయని బాధితులు వాపోతున్నారు. ఇంతా పెద్దాస్పత్రిలో మందు గోలీ కూడా కరువైందని రోగులు గగ్గోలు పెడుతున్నారు.

పేదల దవాఖానాపై సర్కారు నిర్లక్ష్యమేల?

బీఆర్‌ఎస్ హయాంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి నిర్లక్ష్యానికి గురైందనే ఆరోపణలున్నాయి. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా పేదల ఆస్పత్రిలో మెరుగైన సేవలపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలున్నాయి. మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోనే ఎంజీఎం ఉన్నా ప్రభుత్వ పట్టింపులేదని, ఈ పది నెలల కాలంలో ఒక్కసారి కూడా ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించ లేదనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. జూన్ 29న సీఎం రేవంత్‌రెడ్డి ఎంజీఎం ఎదురుగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తనిఖీ చేసినా పేదల ఆస్పత్రిలో సౌకర్యాలను పరిశీలించేందుకు ఎంజీఎంలోకి రాలేదనే విమర్శలు న్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రెండు సార్లు వరంగల్ పర్యటనకు వచ్చినా ఎంజీఎం ఆస్పత్రిలో సమస్యలపై సమీక్షించలేదని ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇక ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నగరంలో ఉన్న అన్ని సమస్యలపై సమీక్షిస్తున్నప్పటికి ఎంజీఎంపై మాత్రం దృష్టి పెట్టడం లేదని, పేదల పక్షాన గళం వినిపించే మంత్రి సీతక్క కూడా ఎంజీఎంలో పేదలకు కనీస వైద్య సౌకర్యాలు కల్పించేందుకు కలగచేసుకోవటం లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎంజీఎంలో సమస్యలను పరిష్కరించకుండా దాటవేసే ప్రయత్నాలు చేస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అప్పుడప్పుడు ఎంజీఎం అస్పత్రి సమస్యలపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మినహా మిగతా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు పెద్దగా పట్టించుకున్న సందర్భాలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. సూపర్ స్పెషాలిటీ అస్పత్రి సేవలు ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే పరిస్థితులు కనిపించటం లేదనే చర్చ జరుగుతోంది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ చూపి ఎంజీఎంలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయటంతో పాటు పేదలకు మెరుగైన వైద్యసేవలు అందేలా దృష్టిపెట్టి అభివృద్ధి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీజేపీతోనే సమగ్రాభివృద్ధి

- రాష్ట్రానికి కేంద్రం అన్నివేళలా అండగా ఉంటుంది
- హైడ్రాపై అసెంబ్లీలో చర్చ పెట్టాలి
- బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్
- జనగామలో సభ్యత్వ కార్యక్రమానికి హాజరు



జనగామలో బీజేపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఈటల రాజేందర్

వివరాలు 7వ పేజీలో..

ఉమ్మడి జిల్లాను వైద్య హబ్‌గా తీర్చిదిద్దుతాం



నర్సంపేట మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రి భవనాన్ని ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ

- ప్రజలకు సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- వరంగల్‌లో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్, క్యాన్సర్ ట్రీట్మెంట్ సెంటర్ ఏర్పాటుకు కృషి
- నర్సంపేటలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- మంత్రులు పొంగులేటి, సురేఖతో కలిసి వైద్యకళాశాల, ఆస్పత్రి ప్రారంభం



మెడికల్ కళాశాల, ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు

వివరాలు 7వ పేజీలో..

ఓటర్ల జాబితా పై అభ్యంతరాలుంటే తెలియజేయాలి

డీపీవో నాగపూరి స్వరూప



వివిధ పార్టీల నాయకులతో సమావేశమైన డీపీవో స్వరూప

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 19: గ్రామాల వారీగా ఓటర్ల జాబితాలను జీపీ కార్యాలయాల్లో ప్రచురించడం జరిగిందని జాబితాలపై ఏమైన అభ్యంతరాలు ఉంటే తెలియపరు చాలని డీపీవో నాగపూరి స్వరూప తెలిపారు. గురువారం డివిజన్ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులతో ఓటర్ల జాబితా సమీక్షించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఎన్నికల కమిషన్ అందించిన జాబితా అనుగుణంగా గ్రామాలలోని వార్డుల వారిగా పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో ఓటరు లిస్టులను రూపొందించడం జరిగిందన్నారు. నూత నంగా రూపొందించిన ఓటరు లిస్టులను గ్రామ పంచాయతీలలో ప్రచురించామని వాటిపై ఏమైన అభ్యంతరాలు ఉంటే దరఖాస్తులు అందించి ఓటరు లీస్టుల లో సవరణలు చేసుకోవచ్చని అన్నారు. ఓటరు లిస్టులో ఇతరాత్ర మార్పులు చేసే అవకాశం తమకు లేదని కేవలం ఒక వార్డు నుంచి మరో వార్డుకు లాంటి మార్పులు చేసే అవకాశం మాత్ర మే ఉందని నాయకులు గమనించాలని కోరారు. అభ్యంతరాలు తెలుపడానికి గాను ఈ నెల 21 వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. ఫైనల్ ఓటరు లిస్టు జాబితాలను ఈ నెల 28న ప్రచురించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయశ్రీ, ఎంపీవో నర్సింగరావు, రమేష్, సురేందర్, నాయకులు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, మాచర్ల గణేష్, మునిగెల రమేష్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్ సస్పెన్షన్



కంచనపల్లిలోని పీఏసీఎస్ భవనం

రఘునాథపల్లి, సెప్టెంబరు 19: మండలంలోని కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చీమలపాటి రవిందర్‌జీని సస్పెండ్ చేస్తూ డీఎస్‌వో రాజేందర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పీఏసీఎస్‌లో పని చేసి సస్పెన్షన్‌కు గురైన సీఈవో వంగ శ్రీనివాస్‌తో కలిసి చైర్మన్ చీమలపాటి రవిందర్‌జీ పీఏసీఎస్‌కు చెందిన రూ.17 లక్షల 25 వేలు దుర్వినియోగం చేసినట్లు విచారణలో నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. కంచనపల్లి గ్రామానికి చెందిన పీఏసీఎస్ సభ్యుడు రాపోలు రామ్మూర్తి ఫిర్యాదు మేరకు నిర్వహించిన విచారణలో నిధులు దుర్వినియోగం అయినట్లు నిర్ధారణ అయినట్లు అధికారులు స్పష్టం చేశారు.

అనువైన స్థలంలోనే మండల కాంప్లెక్స్ నిర్మాణం

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
- కేజీబీవీ సందర్శన, నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచన
- ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డుల పరిశీలన



కేజీబీవీలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్


చిలుపూర్, సెప్టెంబరు 19 : మండల ప్రజలకు అనువైన స్థలంలోనే మండల కాంప్లెక్స్ (ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయం) నిర్మించేందుకు చర్యలు చేపడుతామని, అందుకోసం తగిన ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులకు సూచించారు. గురువారం చిలుపూర్ మండల కేంద్రంలో పర్యటించిన ఆయన మండల కాంప్లెక్స్ నిర్మాణం కోసం సర్వేనంబర్ 197లో, బుగులు వెంకన్న దేవస్థానం (చిలుపూర్ గుట్ట) దిగువన కేటాయించిన 6 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో, ఎమ్మార్వో కార్యాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అంతకుముందు రాజవరం పరిధిలో ఉన్న కేజీబీవీ పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న టాయ్‌లెట్స్, తాగునీటి వసతికి సంబంధించిన పనులను పర్యవేక్షించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ, నూతనంగా ఏర్పాడ్డ చిలుపూర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచనల మేరకు ప్రభుత్వ భూములను గుర్తించామన్నారు. త్వరలోనే నిర్మాణ పనులకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో బర్మావత్ శంకర్, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, ఎమ్మార్ఐ కలువల శ్రీనివాస్, మండల రెవెన్యూ సర్వేయర్ నరేష్‌కుమార్ నాయక్, కేజీబీవీ ప్రత్యేక అధికారి ప్రశాంతి, ఈజీఎస్ ఏపీవో మోహన్‌రావు పాల్గొన్నారు.

రైతు సంఘం నాయకుల ముందస్తు అరెస్టు



పోలీస్ స్టేషన్‌లో రైతు సంఘం నాయకులు

జనగామ రూరల్, సెప్టెంబరు 19: అర్హులైన రైతు లందరికీ రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందునాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం నాయకులు 'ఛలో ప్రగతిభవన్'కు పిలుపునివ్వడంతో జనగామ మండలంలోని రైతు సంఘం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి జనగామ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా చందూ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన రైతు లందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతుల కోసం పోరాటం చేస్తున్న నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని, రానున్న రోజుల్లో రైతులు తగిన బుద్ధి చెబుతారన్నారు. రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రూ.వెయ్యి బోనస్, భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో మంగ బీరయ్య, మీట్యా నాయక్, కృష్ణ స్వామి, మల్లయ్య, రాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.









బాలికపై అత్యాచారం

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

ఐనవోలు, సెప్టెంబరు 19: బాలికపై అత్యాచారం చేసిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని ఒక గ్రామంలో బాలికపై అదే గ్రామానికి చెందిన అలాకుంట మధు అనే యువకుడు అత్యాచారం చేశాడు. బాధితురాలు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



















ఇక ఏడాదిలో రెండు దఫాలుగా పీహెచ్‌డీ అడ్మిషన్లు

కేయూలో కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా నోటిఫికేషన్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కాకతీయ యూనివర్సిటీలో ఇకపై ఏడాదిలో రెండు దఫాలుగా పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సెప్టెంబరు 14న ఇదే విషయంపై 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్‌లో ముందే ఆయా మార్గదర్శకాలను, వివరాలను వెల్లడిస్తూ కథనాన్ని ప్రచురించింది. దీనిపై వెంటనే స్పందించిన వర్సిటీ ఉన్నతాధికారులు.. నోటిఫికేషన్ వెలువరించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం న్యూఢిల్లీలోని యూజీసీ కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతీ ఏడాది జనవరి, జూలై నెలల్లో 2024-25 సవరించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల నోటిఫికేషన్లు జారీ చేస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి గురువారం తెలిపారు. ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు అన్ని విభాగాల డీన్లకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. విభాగాల వారిగా ఖాళీల మేరకు ప్రతీ ఏడాది రెండు దఫాలుగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఉత్తర్వులు విడుదల చేశారు. ఫెల్లోషిప్ అభ్యర్థులతో పాటు యూజీసీ నెట్, సీఎస్ఐఆర్, సీఈఈడీ, డీబీటీ, ఎఎఫ్‌పీడబ్ల్యూడీ, డీఎస్‌టీ, ఇన్‌స్పైయిర్ ఆఫ్ ఎఫ్ఐపీ, క్యూఐపీ, నెట్, గేట్, జీపీఏటీ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షల స్కోరు ఆధారంగా నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కేయూ.ఏసీ.ఇన్‌లో చూడాలని పేర్కొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో వరంగల్ సత్తా

బ్రాంజ్ మెడల్ సాధించిన శ్రీ చేతన్ శౌర్య

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 19: పశ్చిమబెంగాల్ రాష్ట్రం కలకత్తా నగరంలో ఈనెల 14 నుంచి 19 వరకు జరిగిన ఆల్ ఇండియా సబ్ జూనియర్స్ అండర్-13 బ్యాడ్మింటన్ పోటీలలో వరంగల్ జిల్లా బల్దియా ఇండోర్ స్టేడియం క్రీడాకారుడు శ్యామల శ్రీ చేతన్ శౌర్య ప్రతిభ కనబరిచాడు. జాతీయస్థాయి బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించినట్టు బల్దియా ఇండోర్ బ్యాడ్మింటన్ కోచ్ మాడిశెట్టి శ్రీధర్‌రావు గురువారం వెల్లడించారు. శ్రీ చేతన్ శౌర్య ఇటీవల దేశవ్యాప్తంగా పలు చోట్ల జరిగిన ర్యాంకింగ్ టోర్నమెంట్‌లలో డబుల్స్‌లో ఇండియాలో 3వ ర్యాంకు సాధించాడు. జాతీయ స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారుడిని వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. రమేష్‌రెడ్డి, బల్దియా స్పోర్ట్స్ డైరెక్టర్ శంకర్‌లింగం, కోచ్ శ్రీధర్‌రావులతోపాటు సీనియర్ క్రీడాకారులు అభినందించారు.



జాతీయ స్థాయిలో బ్రాంజ్ మెడల్ సాధించిన శ్రీ చేతన్ శౌర్య

అస్ట్రేలియా అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక

కేయూ ఇంజనీరింగ్ స్టూడెంట్ సాత్విక ఎప్పీకి అరుదైన అవకాశం



కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ ఫైనల్ ఇయర్ విద్యార్థి లాదెళ్ల సాత్విక ఎప్పీకి అరుదైన అవకాశం లభించింది. అక్టోబరు 3, 4 తేదీల్లో అస్ట్రేలియా ఖండంలోని పెర్త్ నగరంలో జరిగే ప్రతిష్ఠాత్మక వరల్డ్ ఫోరం 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఇన్ రీసెంట్ చాలెంజెస్ ఇన్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ -2024' అనే అంతర్జాతీయ సదస్సుకు హాజరు కానుంది. ఈ మేరకు సదస్సు సెక్రటరీ డాక్టర్ ఫ్రాంక్ హోవర్డ్ నుంచి లాదెళ్ల స్వాతిక ఎప్పీకి ఆహ్వానం అందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు తెలిపారు. సదస్సులో స్వాతిక ఎప్పీ 'అన్ ఇంప్రూవ్డ్ రాండమ్ ఫారెస్టు ఆల్‌గోరిథమ్ ఫర్ ఫెటల్ హెల్త్ క్లాసిఫికేషన్' అనే అంశం పై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైన స్వాతిక ఎప్పీని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

రైల్వే మూడోలైన్‌ను పరిశీలించిన సేఫ్టీ కమిషనర్

కాజీపేట, సెప్టెంబరు 19: కాజీపేటలో గురువారం రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి రైల్వేట్రాక్‌లను పరిశీలించారు. ప్రత్యేక ట్రాలీలో ముందుగా కాజీపేట నుంచి వరంగల్ మీదుగా తిరిగి హసన్‌పర్తి వరకు ట్రాక్‌ను పరిశీలించారు. కోమటిపల్లి వద్ద నిర్మించిన సొరంగమార్గం సైతం పరిశీలించారు. ఈ సొరంగ మార్గంపై ఉన్న రైల్వే ట్రాక్‌ను పరిశీలించినట్లు తెలిసింది. సొరంగమార్గంతో పాటు మూడోలైన్ నిర్మాణం అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ఆదేశాలను జారీ చేసినట్లు సమాచారం. ఈ తనిఖీల శుక్రవారం సైతం కొనసాగనున్నాయి. త్వరలో ఈ ట్రక్‌ల ద్వారా రైళ్లు నడవనున్నాయి.

సీనియారిటీల ప్రకారమే బదిలీలు చేపట్టాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 19: వర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులను సీనియారిటీ ప్రకారమే బదిలీలు చేపట్టాలని, అలాగే కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ఎన్నికలను నిర్వహించాలని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు కలిసి విన్నవించారు. శుక్రవారం సాయంత్రం రిజిస్ట్రార్ మల్లారెడ్డిని తన చాంబర్‌లో వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు డాక్టర్ ఎస్.రాజేశ్, సతీశ్ తదితరులు కలిశారు. తమ సమస్యలను పరిష్కారించాలని కోరగా కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారిస్తామని చెప్పినట్లు కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు వెల్లడించారు.

హనుమకొండ ఆర్టీఏలో ఆ ముగ్గురిదే ఇష్టారాజ్యం!

ఎవరి దందా వారిదే.. ఉన్నతాధికారులన్నా లెక్కలేని తనం

భరించలేక దీర్ఘకాలిక సెలవులో వెళ్లిన అధికారి?

రాంనగర్, సెప్టెంబరు 19: హనుమకొండ జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో ముగ్గురు అధికారుల ఇష్టారాజ్యం కొనసాగుతోందని, వారు ఎవరి దందా వారు చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్‌లు తదితర విధులు నిర్వహించే ఈ అధికారులకు ఉన్నతాధికారులంటే లెక్కలేదని, రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్, ఓవర్‌లోడ్ లాంటి విషయాల్లో ఈ ముగ్గురు ఎంతంటే అంత అనే చందంగా వ్యవహారం ఉంటోందనే విమర్శలున్నాయి. గత ఉన్నతాధికారి హయాంలో హవా కొనసాగించిన ఈ ముగ్గురు ప్రస్తుత అధికారి మాటలను లెక్కచేయడం లేదని, దీంతో సదరు ఉన్నతాధికారికి ఈ ముగ్గురికి మధ్య విధుల నిర్వహణలో తీవ్ర అభిప్రాయబేధాలు నెలకొన్నాయని, ఉన్నతాధికారి ఆదేశాలను వారు వినిపించుకున్న పాపాన పోలేదని తెలుస్తోంది.

వాస్తవానికి ఈ ముగ్గురిలో ఇద్దరు ఒకవైపు.. మరొకరు ఒకవైపు ఉన్నా.. ఉన్నతాధికారి విషయం వచ్చే సరికి ఆ ముగ్గురు ఒక్కటవుతారని తెలిసింది. శాఖాపరమైన ప్రతీ విషయంలో ఉన్నతాధికారికి ముగ్గురు అధికారులకు మధ్య సఖ్యత లేక ఇబ్బందులు తలెత్తుతుండటంతో పాటు కార్యాలయంలో నెలకొన్న పరిస్థితులతో ఆ ఉన్నతాధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లు తెలిసింది. ముగ్గురిని సమన్వయం చేయలేని స్థితిలో, తనకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ ముగ్గురి దందాను అరికట్టడంలో విఫలమైన సదరు ఉన్నతాధికారి విధిలేని పరిస్థితిలో వీలుంటే వేరే జిల్లాకు, లేదంటే వలంటరీ రిటైర్మెంట్ తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మొత్తంగా ముగ్గురు అధికారుల వైఖరి శాఖకు ముప్పు తేవడంతో పాటు ఏకంగా ఓ ఉన్నతాధికారి ఉద్యోగం వదులుకునే పరిస్థితి తీసుకొచ్చిందంటే వారి దందా ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.


వైద్యకళాశాలలో ప్రదర్శనకు పెట్టిన అస్థిపంజర నమూనాను పరిశీలిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు

ఉమ్మడి జిల్లాను వైద్య హబ్‌గా తీర్చిదిద్దుతాం..

ప్రజలకు సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

నర్సంపేటలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

నర్సంపేట / నర్సంపేట టౌన్, సెప్టెంబరు 19: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలోనే అత్యంత ప్రాధాన్యం కలిగిన ఉమ్మడి వరంగల్ జిల్లాను వైద్య హబ్‌గా తీర్చిదిద్దుతామని, ఇక్కడి ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో రూ.183కోట్లతో నిర్మించిన వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రి భవనాన్ని గురువారం ఆయన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి దామోదర మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అన్ని రంగాలను నిర్లక్ష్యం చేసిందని, ఫలితంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. రాష్ట్రం ఏర్పడితే తమ తలరాతలు మారుతాయని, పిల్లల భవిష్యత్తు బంగారు బాట పడుతుందని ఆశించిన ప్రజలకు గత పదేళ్ల అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే గుర్తింపు కలిగిన ఓరుగల్లు జిల్లాను నాలుగు ముక్కలుగా చేసిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని, అలా అభివృద్ధిలో వెనుకబడిన ఉమ్మడి వరంగల్ జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాను వైద్య హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో వరంగల్‌లో మానవ అవయవాల ట్రాన్స్‌ప్లాంటేషన్ సౌకర్యాలు, క్యాన్సర్ ట్రీట్‌మెంట్ సెంటర్‌తో పాటు, ట్రామా సెంటర్‌లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 40శాతం బదిలీలను పారదర్శకంగా పూర్తి చేశామన్నారు. 4వేల వైద్య పోస్టులతో పాటు, 2,050 నర్సింగ్ పోస్టులు, 450 ల్యాబ్‌టెక్నిషియన్ పోస్టులను భర్తీ చేశామన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం రూ.400కోట్లు అదనంగా ఖర్చు చేస్తోందని, రాష్ట్రంలో 9 కళాశాలలకు గాను నర్సంపేట మెడికల్ కళాశాలను ప్రారంభించామని, మిగిలిన 8 వైద్యకళాశాలలను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు, వైద్య కళాశాలలకు వెళ్లడానికి నాటి వైఎస్ఆర్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం అమలు చేయడంతో పాటు 102, 108, 104 అంబులెన్స్‌లను తీసుకొచ్చిందన్నారు. అదే స్ఫూర్తితో వైద్య రంగానికి ప్రాధాన్యమిస్తున్న తమ ప్రభుత్వం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి రూ.2వేల కోట్లతో నూతన భవనాన్ని నిర్మించడానికి కృషి చేస్తోందన్నారు.


స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు చెక్కులను అందజేస్తున్న మంత్రులు


క్యాంటీన్‌లో వంటకాలను రుచి చూస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

మాది చేతల ప్రభుత్వం : పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని, తొమ్మిదిన్నరేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ నేతలు తాము చేసిన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. తాము ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 23లక్షల మంది రైతులకు రూ.18వేల కోట్ల రుణాలను మాఫీ చేశామన్నారు. ఇంకా రూ.13వేల కోట్లు రుణమాఫీ చేయాల్సి ఉందని, సాంకేతిక కారణాలతో అవి ఆగాయన్నారు. ఇందిరమ్మ రాజ్యం కోసం కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చిన ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేస్తామన్నారు. వైద్యం, విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇందులో భాగంగానే నర్సంపేటలోని మెడికల్ కళాశాల, 170 పడకల జనరల్ ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించామన్నారు. పేదలకు మెరుగైన వైద్యం కోసమే ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10లక్షల సౌకర్యం కల్పించిందన్నారు. రాష్ట్రంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కోసం ప్రభుత్వం రూ.657కోట్లను కేటాయించి విద్య పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. అన్ని కులాలకు చెందిన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు రూ.100 నుంచి రూ.110కోట్లను వెచ్చించామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మిషన్ భగీరథ పథకం కింద ప్రజలకు తాగునీరు అందలేదన్న విషయం విషయం తాము అధికారంలోకి వచ్చాక నిర్వహించిన సర్వేలో 53శాతం మంది ప్రజలు చెప్పారన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో పంట, ఆస్తుల నష్టం భారీగా జరిగిందని, సీఎం రేవంత్‌రెడ్డి వరద ప్రాంతాలను స్వయంగా పరిశీలించారని, 44 గంటల్లోనే బాధితులను ఆదుకున్నామన్నారు. త్వరలోనే అర్హులైన వారికి తెల్ల రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందజేస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులు, మిషన్ భగీరథ పథకం కింద 15 నుంచి 20వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, ఇదంతా ప్రజలు గమనించారన్నారు. ఇక కాంగ్రెస్ అధికారంలో ఉన్నా లేకపోయినా ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు దొంతి మాధవరెడ్డి అండగా ఉన్నారంటూ మంత్రి పొంగులేటి ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు మహిళా సంఘాల సభ్యులకు చెక్కులను అందజేశారు. మహిళా క్యాంటీన్‌ను సందర్శించి అక్కడి వంటకాలను రుచిచూశారు.


ప్రారంభోత్సవానికి హాజరైన మహిళలు

మహిళల సాధికారత కోసం క్యాంటీన్లు : సురేఖ

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న తమ ప్రభుత్వం మహిళలు సాధికారత కోసం క్యాంటీన్లను ఏర్పాటు చేస్తోందని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో నర్సంపేటలో మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రి ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో మారుమూల గ్రామీణ ప్రాంత మహిళలు హైదరాబాద్‌కు మెరుగైన వైద్యం కోసం తరలివెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ రాంచందర్‌నాయక్, ఎంపీ బలరాం నాయక్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మురళీనాయక్, వరంగల్ కలెక్టర్ సత్యశారద, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, డీఎంహెచ్‌ఓ వాణి, డీసీపీ రవీందర్, ఆర్డీవో కృష్ణవేణి, వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర చైర్మన్లు బెల్లయ్యనాయక్, రియాజ్, అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.


సీపీకి పూల మొక్క అందిస్తున్న ఏసీపీ భోజరాజు

సీపీని కలిసిన క్రైమ్ ఏసీపీ

వరంగల్ క్రైం, సెప్టెంబరు 19: వరంగల్ కమిషనరేట్ క్రైమ్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన భోజరాజు సీపీ అంబర్ కిషోర్ ఝాను మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన బోజరాజు గురువారం సీపీని కలిసి మొక్కను అందించారు.

ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ రణధీర్‌రెడ్డి రాజీనామా

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: కాకతీయ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం ప్రిన్సిపాల్ సీహెచ్. రణధీర్‌రెడ్డి తప్పుకున్నారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని కలిసి తన రాజీనామా పత్రాన్ని అందచేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. తన రాజీనామాపై వర్సిటీ రిజిస్ట్రార్ చాంబర్‌లో దాదాపు 3, 4గంటల పాటు చర్చించినట్లు తెలిసింది. అయితే వర్సిటీకి నూతన వైస్‌చాన్స్‌లర్ వచ్చేవరకు ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగాలని రిజిస్ట్రార్ మల్లారెడ్డి రణధీర్‌రెడ్డిని కోరినట్లు తెలిసింది. అయితే తాను కొనసాగలేనని, తన రాజీనామాను ఆమోదించాలని రణధీర్‌రెడ్డి కోరినట్లు సమాచారం.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 19: జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న ఇల్లందుల రత్నంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. రత్నం కొంతకాలంగా చిరు వ్యాపారస్తులు, కూలీలతో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో గురువారం దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ ఆధ్వర్యంలో దాడి చేసి రూ.వెయి నగదును స్వాధీనం చేసుకుని రత్నంను అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం రత్నంను ఘనపూర్ పోలీసులు అప్పగించారు.

కేయూ డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ల ఫీజు గడువు 26

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 19: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతరకోర్సుల 1, 3, 5 సెమిస్టర్‌ల పరీక్షల ఫీజులను సెప్టెంబరు 26 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పి.తిరుమలదేవిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50అపరాధ రుసుంతో అక్టోబరు 4 ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని వారు కోరారు.

బీజేపీతోనే దేశ సమగ్రాభివృద్ధి

● రాష్ట్రానికి కేంద్రం అన్నివేళలా అండగా ఉంటుంది ● హైడ్రాపై అసెంబ్లీలో చర్చ పెట్టాలి..
● బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్


జనగామలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఈటల రాజేందర్

జనగామ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని, రాష్ట్రానికి కేంద్రం అన్నివేళలా అండగా ఉంటుందని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేవైఎం ఆధ్వర్యంలో జనగామ జిల్లాకేంద్రంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఈటల అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత్‌ను విశ్వగురువుగా నిలిపేందుకు ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారని, ఆయన దేశంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. రవాణా సౌకర్యాలను మెరుగుపరచారని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనల సరళీకరణ వంటి విప్లవాత్మక నిర్ణయాలు ఉన్నాయన్నారు. అలాంటే తెలంగాణ అభివృద్ధికి కూడా కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసిరాకపోవడం వల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందన్నారు.


పేదల ఇళ్లు కూల్చితే సహించం

హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చాలని చూస్తే సహించబోమని హెచ్చరించిన ఈటల హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి తన సొంత ఎజెండాను అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు హైడ్రా శ్రీరామ రక్ష అని సీఎం భావిస్తే అసెంబ్లీలో చర్చకు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చెరువులు, వాగుల రక్షణ జరగాలని, అక్రమ కట్టడాలను అరికట్టాలనే బీజేపీ కూడా కోరుకుంటోందని స్పష్టం చేశారు. తానే తొలి ముఖ్యమంత్రి అయినట్టుగా, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడే పుట్టినట్టుగా, సమాజహితాన్ని తాను ఒక్కడే కోరుకుంటున్నట్టుగా రేవంత్ వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలోని ముఖ్యమంత్రులు తప్పులు చేస్తే తానే సరిదిద్దుతున్నట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. అన్ని రకాల అనుమతులు ఉండి, ఏళ్లుగా ట్యాక్సులు కడుతున్న నిర్మాణాలను చట్టబద్ధత లేని హైడ్రా ద్వారా ఎలా కూల్చుతారని ప్రశ్నించారు. గత ప్రభుత్వాల హయాంలో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారని, నాడు ప్రభుత్వ అనుమతులతో కట్టుకున్న కాలనీలకు సైతం నోటీసులు ఇచ్చి కూలగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, అలా చేయడానికి తెలంగాణ రేవంత్‌రెడ్డి అబ్బ జాగీరా అని నిలదీశారు. రేవంత్‌రెడ్డికి చెరువుల రక్షణ విషయంలో నిజాయితీ ఉంటే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరిగిన ఆక్రమణలపై ఏం చేయాలన్న దానిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. తన పలుకుబడిని పెంచుకోవడం కోసం, పార్టీలో ఉన్న సమస్యలను దృష్టి మళ్లించేందుకే రేవంత్‌రెడ్డి ఇలా చేయడం మంచిది కాదని హితవు పలికారు. ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకుంటే కళ్లు నెత్తికి ఎక్కిన కేసీఆర్‌కు ఏ గుణపాఠం చెప్పారో రేవంత్‌రెడ్డికి కూడా ప్రజలు అదే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కేవీఎల్ఎన్ రెడ్డి, ఉడుగుల రమేశ్, విద్యాసాగర్, జిల్లా నాయకులు శివరాజ్‌యాదవ్, రాజశేఖర్, సౌడ రమేశ్, బీజేవైఎం నాయకులు రాజవెంకటనర్సింహారెడ్డి, రవి, రాజేశ్, ఉల్లెంగుల రాజు, కీర్తి వెంకటేశ్ తదిరుతులు పాల్గొన్నారు.

జ్యోతిష్యంలో అందెవేసిన 'చేయి'

● భవిష్యత్తు దిక్సూచి సుదర్శనాచార్యులు ● ఇప్పటికే పలు అవార్డులు, సత్కారాలు
● 22న గౌరవ డాక్టరేట్, స్వర్ణకంకణం బహూకరించనున్న టీటీడీ దేవస్థానం


మాజీ గవర్నర్ రోశయ్య చేతుల మీదుగా జ్యోతిష విశారద అవార్డును అందుకుంటున్న సుదర్శనాచార్యులు (ఫైల్)


పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పట్టాతో..


సంగెం, సెప్టెంబరు 19: జ్యోతిష్యంలో ఆయనకు ఆయనే సాటి.. ఆయన పాండిత్యం అందరిని మంత్రముగ్ధులను చేస్తోంది. గ్రామీణ ప్రాంతంతో పాటు పట్టణాలకు చెందిన వారికి ఆయన జ్యోతిషంపై అపార నమ్మకం. శుభకార్యాలు కానీ, ముహూర్తాలు కానీ, మంచి, చెడు, ప్రయాణాలు, విద్య, వివాహ తదితర ఏ కార్యక్రమానికైనా ఆయన పెట్టిందే ముహూర్తం. చెప్పిందే సత్యం. అదీ ఆయనకు ప్రజలపై ఉన్న నమ్మకం. ఆయనే వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ఊకల్ నాగేంద్రస్వామి ప్రధా న అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు. బుధవారం ఏకంగా ఇటీవల పీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆలయాన్ని సందర్శించడం తో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది.

విద్యాభ్యాసం - అవార్డులు

వరంగల్ జిల్లా సంగెం మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన సముద్రాల కృష్ణామాచార్యులు - విజయలక్ష్మి రెండో కుమారుడు సముద్రాల సుదర్శనాచార్యులు జ్యోతిష్యంలో దిట్ట. వరంగల్‌లో ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు చదువుకున్నారు. చిన్నప్పటినుంచే పౌరహిత్యం తండ్రి ద్వారా వారసత్వంగా అబ్బింది. చింతలపల్లి, ఊకల్ నాగేంద్రస్వామి ఆలయాల్లో అర్చకత్వం చేస్తే భక్తులకు సేవలందిస్తున్నారు. కాగా, ప్రాథమిక, ఉన్నత విద్యను చింతలపల్లి, సంగెం గ్రామాల్లో పూర్తి చేశారు. పొట్టిశ్రీరాముల తెలుగు యూనివర్సిటీలో జ్యోతిష్యంలో ఎంఏలో పట్టా అందుకున్నారు. 2018లో అప్పటి తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా చెన్నైలో జ్యోతిష్య విశారదను అందుకున్నారు. అంతర్జాతీయ వాసవీక్లబ్ అధ్వర్యంలో జ్యోతిష్య ప్రజ్ఞ ప్రావీణ్య, సర్వేజనా సుఖీనోభవంతు సంస్థ నేతృత్వంలో జ్యోతిష్యరత్న అవార్డులను అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అధ్వర్యంలో కిందటేడు వేదాంగ జ్యోతిష్య అవార్డును పొందారు. ప్రస్తుతం అమెరికాలోని ఫ్లోరిడా యూనివర్సిటీలో హస్తరేఖ ఫలితాలపై పీహెచ్‌డీ చేస్తున్నారు. సముద్రాల సుదర్శనాచార్యులకు భార్య భార్గవి, కుమారుడు శ్రీహర్ష, కూతురు శ్రేయ ఉన్నారు.

టీటీడీ డాక్టరేట్, స్వర్ణ కంకణం

సముద్రాల సుదర్శనాచార్యులకు జ్యోతిష్యంలో ఉన్న పాండిత్యాన్ని గుర్తించిన తిరుమల తిరుపతి దేవస్థాన అర్చకులు.. ఆయనకు స్వర్ణకంకణంతో పాటు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించారు. ఈ మేరకు తిరుమల దేవస్థానంలో టీటీడీ వేద విజ్ఞాన పరిషత్‌లో శుక్ర, శని, ఆదివారాల్లో జరిగే సమ్మేళనంలో వీటిని అందించనున్నారు. ఇప్పటికే సుదర్శనాచార్యులకు టీటీడీ అర్చకుల నుంచి ఆహ్వానం అందింది. దీంతో వరంగల్ నుంచి శుక్రవారం రాత్రి సుదర్శనాచార్యులు తిరుమలకు బయలుదేరి వెళ్లనున్నారు.



ఊకల్ నాగేంద్రస్వామి దయతోనే..
జ్యోతిష్య పండితుడు సముద్రాల సుదర్శనాచార్యులు

ఊకల్‌లో గల నాగేంద్రస్వామి ఆశీర్వాదంతో తండ్రి నుంచి నేర్చుకున్న పౌరహిత్యమే నన్ను ఇంతటి వాడిని చేసింది. ప్రతీ మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తూ స్వామి వారి తీర్థప్రసాదాలను నా కుమారుడు శ్రీహర్ష సహకారంతో భక్తులకు అందిస్తున్నాం. జ్యోతిష్యంపై పాండిత్యం సంపాదించాలన్న పట్టుదలతో చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టా. నాకు తెలిసిన జ్యోతిష్యాన్ని ప్రజలకు చెబుతూ సేవలందిస్తున్నా.. టీటీడీ వారు డాక్టరేట్, స్వర్ణ కంకణం ప్రకటించడం సంతోషంగా ఉంది.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు



పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ పోస్టర్ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నరసింహారావు తదితరులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18: ఈ నెల 30న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే పీడీఎస్‌యూ 50వ స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు పిలుపునిచ్చారు.

ఈ మేరకు శుక్రవారం కేయూలో పీడీఎస్‌యూ 50 వసంతాల పోస్టర్‌ను నరసింహారావు నేతృత్వంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలోని పేదలకు ఉచిత నాణ్యమైన, కామన్ విద్యను అందించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ప్రాథమిక స్థాయి నుంచి వర్సిటీల స్థాయి వరకు విద్యను ప్రైవేట్ పరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో విద్య వ్యాపారమయమైందని ఎద్దేవా చేశారు. పీడీఎస్‌యూ పేద విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాడుతోందని అన్నారు. పీడీఎస్‌యూ విద్యార్థి పోరాటంలో నేతలు జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, ప్రసాద్, కోలా శంకర్, శ్రీపాద ప్రసాదరావు, బొమ్మ సాంబయ్య, రంగవల్లి, చేరాలు, వరహాలు, రమణయ్య, మధుసూధన్ రాజ్, మరోజు వీరన్నతో మరెందరో మరణించారని చెప్పారు. వారి త్యాగాలు వృథా కావని అన్నారు. ఓయూలో 50వ పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సంబురాల్లో ఉద్యమాన్ని సమీక్షించి, విద్యార్థి అమరుల స్ఫూర్తితో భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ నేతలు అశోక్, సంగీత, అనూష, స్వాతి, నరేశ్, పృథ్వీ, అజహర్, రమేశ్, వీరేందర్, రాజు, సునీల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సుందర్‌రాజ్‌కు బుజ్జగింపులు

● పార్టీ మారకుండా బీఆర్ఎస్ నేతల చర్చలు ● కాంగ్రెస్ నేతలూ భేటీ

రాంనగర్, సెప్టెంబరు 19: మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి ఆ పార్టీ నేతలు అప్రమత్తమయ్యారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్.. సుందర్‌రాజ్‌తో గురువారం చర్చలు జరిపారు. తొందరపడి నిర్ణయం తీసుకోవద్దని సూచించారు. బీఆర్ఎస్‌ను వీడవద్దని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గతంగా చర్చించుకుందామని ఆయనకు సూచించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలు సైతం సుందర్‌రాజ్‌తో మాట్లాడి పార్టీ మారాలనుకునే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని సూచించారు. కాగా, ఒకటిరెండు రోజుల్లో సుందర్‌రాజును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి మాట్లాడించాలని ఆ పార్టీ నేతలు నిర్ణయించినట్లు తెలిసింది. బీఆర్ఎస్‌ను వీడే విషయమై తన సన్నిహితులతో సుందర్‌రాజ్ రోజంతా చర్చలు జరిపినట్లు సమాచారం.

కాగా, సుందర్‌రాజ్‌తో కాంగ్రెస్ పార్టీ జిల్లా ముఖ్య నేతలు చర్చించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనలో సుందర్‌రాజ్‌కు కాంగ్రెస్ కండువా కప్పాలని నిర్ణయం తీసుకున్న నేతలు.. బీఆర్ఎస్ నేతల చర్చలతో సుందర్‌రాజ్ యూ టర్న్ తీసుకునే అవకాశం ఉంటుందని, ఈలోగానే సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. సుందర్‌రాజ్ చేరికపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించిన కాంగ్రెస్ నేతలు ఒకటిరెండు రోజుల్లో కాంగ్రెస్ కండువా కప్పించే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. పార్టీలోకి వస్తే సముచిత స్థానం కల్పించేందుకు హామీ ఇచ్చినట్లు సమాచారం.


తనిఖీ చేస్తున్న అధికారులు

ఎంజీఎం ఆవరణలోని దుకాణాల్లో అధికారుల తనిఖీలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 19: ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో అక్రమంగా వెలిసిన దుకాణాలపై జిల్లా యంత్రాంగం దృష్టి కేంద్రీకరించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల ఎంజీఎంను సందర్శించిన సందర్భంలో వెలిసిన దుకాణాలపై ఆరా తీశారు. ఈ విషయంలో విచారణ జరపాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ ఎంజీఎం ఆవరణలో వెలిసిన దుకాణాలపై గురువారం ఆరా తీశారు. తాగునీటి నుంచి మొదలుకొని మాస్కుల వరకు ఇష్టానుసారంగా విక్రయిస్తున్నట్లు రోగులు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా ఎమ్మార్పీతో సంబంధం లేకుండా విక్రయాలు కొనసాగుతున్నట్లు గుర్తించారు. నాసిరకం సరుకులు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నట్లు కూడా కొందరు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన విచారణలో వెల్లడైన విషయాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నారు.

ఓటరు జాబితా తయారీకి సహకరించాలి



లింగాలఘణపురం మండల పరిషత్ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశానికి హాజరైన పార్టీల నాయకులు

రఘునాథపల్లి, సెప్టెంబరు 19:గ్రామ పంచాయతీ ఎన్నికల నిమిత్తం వార్డుల వారీగా ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీల నాయకులందరూ సహకరించాలని ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో గురువారం జరిగిన సమావేశంలో రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా ఓటరు జాబితా తయారీపై అధికారులు పలువురితో చర్చించి సలహాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో ఎంపీవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ విమల, ఏఎస్‌ఐ కట్టమల్లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● బచ్చన్నపేట : గుర్తింపు పొందిన పార్టీలతో గురువారం ఎంపీడీవో మల్లిఖార్జున్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా-2024పై అభ్యంతరాల కోసం గ్రామాల వారిగా జీపీల వద్ద ఓటరు జాబితాలు ఉంచటం జరిగిందన్నారు. అభ్యంతరాలు స్వీకరించడం జరిగిందన్నారు. నేతలు చేసే సూచనలు స్వీకరిస్తామన్నారు. సమావేశంలో వివిధ పార్టీల మండల బాధ్యులు నూకల బాల్‌రెడ్డి, బోడిగం చంద్రారెడ్డి పాల్గొన్నారు.

● లింగాలఘణపురం : లింగాలఘణపురం మండలానికి చెందిన గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటరుజాబితా ప్రచురణపై ఎంపీడీవో జలంధర్‌రెడ్డి అఖిల పక్షాలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండలానికి చెందిన ఓటరుజాబితా వివరాలను వెల్లడించారు. సూపరింటెండెంట్ సీతారామ్‌నాయుడు, ఎంపీవో రఘురామకృష్ణ, అఖిల పక్ష పార్టీలకు చెందిన బాధ్యులు బొడ్డు కరుణాకర్, తూటి దేవదానం, మోహన్ పాల్గొన్నారు.

● పాలకుర్తి :మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాములు ఆధ్వర్యంలో గురువారం ఓటరు జాబితాలోని అభ్యంతరాలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, బీఆరెస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, భుజేందర్ ఉన్నారు.

● నర్మెట : గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఓటరు జాబితాలో చేయాల్సిన మార్పులు, చేర్పులను ఈ నెల 21 లోపు తెలపాలని ఎంపీడీవో అరవింద్‌చౌదరి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● కొడకండ్ల : రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు లిస్టులో సవరణలపై ఎంపీడీవో నాగ శేషాద్రి సూరి చర్చించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సూపరిండెంట్ ఇందిర, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు సింధె రామోజి, పేరం రాము, కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు డి.సురేష్‌నాయక్, మసురం రవీందర్, ధర్మారం భిక్షపతి పాల్గొన్నారు.

● జఫర్‌గడ్ : స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రూపొందించబడిన ఓటరు జాబితాలపై ఈనెల 21వ తేదీ వరకు అభ్యంతరాలను తెలపాలని జఫర్‌గడ్ ఎంపీడీఓ సుమన్ రాజకీయ పక్షాల ప్రతినిధులను కోరారు. ఓటరు జాబితాలపై గురువారం మండలంలోని ఆయా ప్రధాన రాజకీయ పక్షాల ప్రతినిధులచే సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ సుమన్ మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ పార్టీల ప్రతినిధులు ఎడ్ల వెంకటయ్య, సింగపురం అశోక్, కడారి శంకర్, కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, రాపర్తి సోమయ్య, జువారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిని సస్పెండ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ రూరల్, సెప్టెంబరు 19: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీకి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపడుతున్న వేమళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, మాసంపల్లి లింగాజీని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉండి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఉంటూ పార్టీకి ద్రోహం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో శివరాజ్ యా దవ్, మిద్దెపాక సిద్దులు, మెరుగు బాలరాజు, వల్లాల మల్లేశం కట్ట కృష్ణ, మోటె శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

ఆరోపణలపై చర్చకు రావాలి

జనగామ రూరల్ : తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న నాయకులు బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణ రెడ్డి ఒక ప్రకటన ద్వారా సవాల్ విసిరారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి కొంతమంది తొత్తులుగా మారి పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ వైభవం కోసం స్వంత భూములను అమ్ముకొని పార్టీ కోసం పనిచేశానని, ఏ ఒక్కరి దగ్గర చేయి చాచలేదని స్పష్టం చేశారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎన్నికల్లో గెలిచే అవకాశం ఉన్న కూడా సీనియర్ నాయకులు పట్టించుకోలేదన్నారు. పార్టీ పేరు చెప్పుకొని ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్న వారిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గమనిస్తుందన్నారు.

విద్యార్థులు లక్ష్యం ఎంచుకుని ముందుకు సాగాలి



ఆదర్శ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

బచ్చన్నపేట, సెప్టెంబరు 19: విద్యార్థులు లక్ష్యం ఎంచుకుని ముందుకు సాగాలి, ఇందుకు ఉపాధ్యాయులు, మేధావుల సలహాలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను, నిధుల వ్యయానికి సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖా దికారి కె రాము, ఎంపీడీవో మల్లిఖార్జున్, నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛన్లు మంజూరు చేయాలి

జనగామ రూరల్, సెప్టెంబరు 19: వితంతులు, ఒంటిరి మహిళలకు పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు మహిళలు ధర్నా చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేశారు. బాల్దే లక్ష్మీ, కర్రె రమ్య, ఉల్లెంగుల అనిత, బాలమణి, అరుణ, సంతోషి, వీరమ్మ, సరిత, చంద్రకళ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలోని హాస్టల్ తనిఖీ

నర్మెట, సెప్టెంబరు 19 : మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలోని బాలికల హస్టల్‌ను ఎంపీడీవో అరవింద్‌చౌదరి గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులు పరిశీలిం చి, బాలికలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి కందకట్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ వ్యతిరేకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

బచ్చన్నపేట, సెప్టెంబరు 19: కాంగ్రెస్ పార్టీకి అభివృద్ధి నిరోధకులుగా మారిన నేతలపై అధిష్టానం క్రమశిక్షణ చర్యల కింద సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నేతలు నిడిగొండ శ్రీనివాస్, దయాకర్‌రెడ్డి, భాగ్యలక్ష్మీ, హరీష్, జ్యోతి భాస్కర్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లారెడ్డి, రమేశ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికం

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 19: రైతులను ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్ తెలిపారు. రుణమాఫి అమలు కాని రైతుల ఆధ్వర్యంలో ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమానికి గురువారం ప్రజా సంఘాల నాయకులు పిలుపునివ్వగా రైతులు ప్రజాభవన్‌కు వెళ్లకుండా వారిని పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. విషయం తెలుసుకున్న సీపీఐ, బీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఆకుల కుమార్, కనకం గణేష్, చల్లా చందర్ రెడ్డి, పొన్నం రంజిత్‌కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ సురేష్, నాయకులు ఎన్నకూస రాంనర్సయ్య, మారపల్లి ప్రసాద్, మారపల్లి ప్రసాద్, మల్లేషం, పొన్న శ్రీనివాస్‌గౌడ్, గాదె రాజు, మాతంగి దేవయ్య, గుండె రంజిత్ పాల్గొన్నారు.

అన్నిటి కంటే సేవే ఉత్తమం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాంచంద్రన్

జనగామ కల్చరల్, సెప్టెంబరు 19: సేవకు మించిన భాగ్యం ఇంకొకటి లేదని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్ అన్నారు. గురువారం జనగామ మండలం శామిర్‌పేట కోమటిరెడ్డి సుశీలమ్మ వృద్ధాశ్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మాదంశెట్టి వరూధిని రవీందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రవిచంద్రన్ ముఖ్య అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ తొలిసారిగా రావడంతో ఆయనను మహిళలు కోలాటాలతో, పూలవర్షంతో, చప్పట్లతో స్వాగతం పలికారు. వాసవీ క్లబ్ ద్వారా అందించే అన్ని సౌకర్యాలను ప్రజలకు అందించాలని కోరారు. జిల్లా గవర్నర్ సాంబమూర్తి మాట్లాడారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు, కిరాణ సామగ్రి, చెప్పులు, ఇతర వస్తువులు రవిచంద్రన్ చేతుల మీదుగా అందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లక్ష విలువ చేసే వాటర్ ట్యాంకు, హాస్ వాష్ స్టేషన్ వితరణ చేశారు. కార్యక్రమంలో కార్యక్రమ రూపకర్త గంగిశెట్టి ప్రమోద్ కుమార్, వైస్ గవర్నర్ సత్యనారాయణ, విడియాల నూతన్‌కుమార్, పబ్బతి నాగభూషణం, మునిసిపల్ చైర్ పర్సన్ పోకల జమున లింగయ్య కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మెన్ పజ్జూరి గోపయ్య, మర్యాల అశోక్, పొద్దుటూరు గౌరీశంకర్, గట్టు వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, అనూజ పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు మేం సిద్ధం

బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా సుందర్‌రామ్‌రెడ్డి

దేవరుప్పుల, సెప్టెంబరు 19: రియల్ ఎస్టేట్ వ్యాపారిని మండల కాంగ్రెస్ నాయకులు కిడ్నాప్ చేసి భయభ్రాంతులకు గురి చేసినట్టు పక్కా ఆధారాలతో నిరూపిస్తామని బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి సవాల్ విసిరారు. గురువారం దేవరుప్పులలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ధైర్యం ఉంటే తేదీ, సమయం, స్థలం చెప్పి బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. 8 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో కాంగ్రెస్ నాయకులు దేవరుప్పుల మండలంలో పెట్రేగి పోతున్నారని, ఇప్పటి వరకు బీఆర్ఎస్ నాయకులు 10మందిపై కేసులు పెట్టారని దుయ్యబట్టారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి వ్యక్తిగత సహాయకుడు ప్రెస్‌మీట్ పెట్టడం రాష్ట్రంలోనే తొలిసారి అని, ప్రభుత్వ సొమ్ము తీసుకుంటూ బీఆర్ఎస్ నాయకులపై నిరాధారమైన ఆరోపణలు చేయటం సిగ్గుసేటన్నారు. తమ మాజీ సర్పంచులను పార్టీలో చేరకపోతే పెండింగ్ బిల్లులు రావని అతడు బెదిరింపులకు గురి చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశం, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రామ్‌సింగ్, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య, మండల నాయకులు కోతి ప్రవీణ్, తాటిపెల్లి మహేష్, బస్వ వెంకన్న, కొత్త జెలేందర్‌రెడ్డి, ఇంటి మల్లారెడ్డి, రాజన్న, కృష్ణమూర్తి, రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాచర్ల భిక్షపతి



భిక్షపతికి బీజేపీ కండువా కప్పుతున్న ఈటల రాజేందర్

జనగామ రూరల్, సెప్టెంబరు 19: జనగామ జిల్లాకు చెందిన మాజీ కన్సల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి గురువారం జిల్లా కేంద్రంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. భిక్షపతి వెంట ముదిరాజ్ సంఘ జిల్లా నాయకుడు, కట్ల సదానందం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం తనవంతు సహాయ సహకారా లు అందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని సూచించారు.

సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యం

రఘునాథపల్లి, సెప్టెంబరు 19:విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు వారి సమస్య పరిష్కార సామర్థ్యాలను మెరుగుపర్చడానికి రోబోటిక్స్ విద్య దోహదపడు తుందని జిల్లా సైన్స్ అధికారి రఘునందన్ రెడ్డి అన్నారు. విద్యారంగంలో సృజనాత్మకతను ప్రోత్సహించే లక్ష్యంతో సోహం అకాడమీ 'రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్' మరో ముందడుగు వేసిందని, సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో జిల్లాలోని మరో ఐదు పాఠశాలల్లో రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్ శిక్షణ కార్యక్రమంలో 546 మంది విద్యార్థులకు శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిందని ఆయన తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు గురువారం పాఠశాలలో సర్టిఫికె ట్లతో పాటు రోబోటిక్స్ కిట్‌లను పంపిణీ చేశారు. రోబోటిక్స్ ఇన్‌చార్జీలు సురేందర్, నాగభూషణం, రవీందర్ పాల్గొన్నారు.

గురుకులాల సమస్యలు పరిష్కరించాలి



కొడకండ్లలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 19: గురుకుల పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశే ఖరరావు తెలిపారు. గురువారం డివిజన్ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల ఎదుట ఇటీవల ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జీఓ నెంబర్ 16ను వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ నాయకులు నల్ల బ్యాడ్జీలు దరించి నిరసన తెలిపారు. నాయకులు ఆకుల శ్రీనివాసరావు, గూడెల్లి కృష్ణ, ప్రిన్సిపాల్ కృతమూర్తి, రవీందర్, మధుసూధనచారి, వినయ్‌కుమార్, గౌసియా పాల్గొన్నారు.

● కొడకండ్ల : గురుకులాల సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌టీయూఎఫ్ నాయకుడు పి.వెంకటాద్రి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం గురుకుల సొసైటీల్లో ఒకే పనివేళలను నిర్ణయిస్తూ జీవో 16 పేరుతో జారీ చేసిన ఉత్తర్వులలో టైంటేబుల్ శాస్త్రీయంగా లేదన్నారు. గురుకుల పాఠశాల విద్యార్థుల మానసిక వికాసానికి తగినట్లు పనివేళలు ఉండాలన్నారు. ఉపాధ్యాయులు వత్తిడి లేకుండా పనిచేసేట్లు ఉదయం 9గంట నుంచి సాయంత్రం 4.30 వరకు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎస్‌డీ మొయినొద్దీన్, బి.సైదులు, ఉపాధ్యాయులు లావణ్య, రూపా, సుమలత, సింధియా పాల్గొన్నారు.

నేడు జల్సా మిలాద్ ఉన్ నబీ, ముషాయిరా

జనగామ కల్చరల్, సెప్టెంబరు 19: మహ్మద్ ప్రవక్త వ్యక్తిత్వం, ఆయన గొప్పతనాన్ని వివరించేందుకు ఈ నెల 20న సాయంత్రం 7 గంటలకు జల్సా మిలాద్ ఉన్‌నబీ, ముషాయిరా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మొమిన్ యూత్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మహ్మద్ ప్రవక్త గొప్పతనం, సేవాగుణం ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీబాయికుంట ఏక్‌మినార్ మసీదు కూడలి వద్ద నిర్వహించే కార్యక్రమానికి హైదరాబాద్, వరంగల్ నుంచి మత పెద్దలు హాజరవుతారని, ముస్లింలు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

తమ్మడపల్లి(జి)లో ఉచిత వైద్య శిబిరం

జఫర్‌గడ్, సెప్టెంబరు 19 : మండలంలోని తమ్మడపల్లి(జి)లోని జడ్పీ హైస్కూల్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జఫర్‌గడ్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో వైద్యాధికారి విష్ణు, పల్లె వైద్యుడు జయప్రకాశ్‌లు బాలబాలికలకు వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. హెచ్‌ఎం సీతారామయ్య, ఏఎన్‌ఎం లక్ష్మీ, ఉపాధ్యాయులు మాధవరెడ్డి, సంపత్, సురేశ్; ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

జఫర్‌గడ్, సెప్టెంబరు 19 : జఫర్‌గడ్ మండలంలో గ్రామంలోని ఇల్లందుల నర్సయ్య ఇంటిలో అక్రమంగా నిల్వ చేసి ఉంచిన 22 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం స్వాధీనపర్చుకున్నారు. యాదాద్రి జిల్లా తుర్కపల్లికి చెందిన భూక్య దేవెందర్ అనే వ్యక్తి జఫర్‌గఢ్ మండలం కూనూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి.. ఇతర ప్రాంతాలకు అధిక ధరలకు విక్రయించేందుకు అక్రమంగా నిల్వ చేశాడు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రామ్‌చరణ్ తెలిపారు.

● రఘునాథపల్లి : వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై మండలంలోని నిడిగొండ వద్ద మినీ గూడ్స్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 39 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు గురువారం పట్టుకున్నారు. బియ్యంతో సహా వాహనంను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బియ్యం తరలిస్తున్న సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం అంతాయగూడెం గ్రామానికి చెందిన నల్ల కనక రాజు, వాహనం డ్రైవర్ చంటి అలియాస్ శివను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జఫర్‌గడ్, సెప్టెంబరు 19 : మండలంలోని తిడుగులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ రామ్‌చరణ్ పోలీసు సిబ్బందితో కలిసి తిడుగు ఆకేరు వాగులో ఆకస్మిక దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఆకేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా రెండు ట్రాక్టర్‌లను పట్టుకుని సీజ్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

జఫర్‌గడ్, సెప్టెంబరు 19 : మద్యం సేవించి వాహనం నడిపిన ఓవ్యక్తికి జనగామ జిల్లా కోర్టు జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. జఫర్‌గడ్ ఎస్‌ఐ రామ్‌చరణ్ నాయక్ గత ఆగస్టు నెలలో పోలీసు సిబ్బందితో కలిసి జఫర్‌గడ్ మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో జఫర్‌గడ్ మండలం ఓబులాపూర్‌కు చెందిన చీపురు వెంకటేశ్వర్లు మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ నేపథ్యంలో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. గురువారం జనగామ కోర్టులో వెంకటేశ్వర్లును ప్రవేశపెట్టగా.. విచారణ జరిపిన జడ్జి అతడికి రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వసతి గృహాల్లో సీట్ల కేటాయింపు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 19: స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ పరిధిలోని వివిధ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సీట్లను కేటాయించినట్లు ఎస్సీ కార్పోరేషన్ జిల్లా అధికారి విక్రమ్‌కుమార్, ఆర్డీవో ధరంసోత్ వెంకన్నలు తెలిపారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను అడ్వైజరి కమిటీ చైర్మన్, ఆర్డీవో వెంకన్న ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 6 ఎస్సీ వసతి గృహాల్లో ఉండడానికి గాను దరఖాస్తులు చేసుకున్న 167మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో ఇంక ఎవరైనా విద్యార్థులు హాస్టల్స్‌లో ఉండడానికి గాను సంబంధిత వసతిగృహం సంక్షేమ అధికారులను సంప్రదించాలని కోరారు.

కూలిన స్తూపాన్ని పరిశీలించిన సీపీఎం నేతలు

లింగాలఘణపురం, సెప్టెంబరు 19: మండలంలోని నెల్లుట్లలో సాయుధపోరాట యోధుడు పందిగోటి కిష్టయ్య స్మారకస్థూపం బుధవారం రాత్రి ఓ వాహనం అదుపుతప్పి వచ్చి ఢీకొట్టడంతో కూలిపోగా సీపీఎం మండల నాయకులు బొడ్డు కరుణాకర్, తూటి దేవదానం సందర్శించారు. ఈ సందర్భంగా స్థూపాన్ని కూలిపోవడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటుగా అదే స్థానంలో కొత్తగా స్థూపాన్ని నిర్మాణం చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకు లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే రఘునాథపల్లి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, లింగాలఘణపురం ఎస్సై శ్రవణ్‌కుమార్‌లు వాహనయజమానిని గుర్తించి విచారణ ప్రారంభించారు. అయితే సంబంధిత వాహనయజమాని సీపీఎం నాయకులతో మాట్లాడి కొత్తగా స్థూపాన్ని నిర్మిస్తానని ఒప్పుకున్నట్లు సమాచారం.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

జఫర్‌గడ్, సెప్టెంబరు 19 : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింప జేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణమాఫీ అంశంపై హైదరాబాద్‌కు రైతులు తరలివెళ్లకుండా ముందస్తుగా పోలీసులు గురువారం రైతు సంఘం నాయకులు, పలువురు రైతు ప్రతినిధులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా రాపర్తి సోమయ్య విలేకరులతో మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేసి.. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినందులకు.. సర్కార్ రైతు సంఘం నాయకులు, రైతులను అరెస్ట్ చేయించడం దారుణమన్నారు.

● చిలుపూర్, సెప్టెంబరు 19 : రైతు రుణమాఫీ విషయంలో ప్రజాభవన్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో, శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు రైతులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. పోలీసుల అదుపులో ఉన్న వారిలో సాదం రమేష్, కూరపాటి దేవేందర్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య శ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్, సెప్టెంబరు 19: రాజీవ్ ఆరోగ్య శ్రీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు విధులను బహిష్కరించి గురువారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యమిత్రలకు డాటా ప్రాసెసింగ్ క్యాడర్ కల్పించాలని, జీవో నం.60 ప్రకారం రూ.22,750.ల వేతనం అమలు చేయాలని, ఆరోగ్యమిత్రల జీతభత్యాలు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా ట్రస్టు ద్వారా చెల్లించాలని తెలిపారు. చింతకింది రాంప్రసాద్, తాళ్లపల్లి చంద్రమౌళి, నల్ల రమేష్, మేకల నాగరాజు, కుసుమ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిక పోటీలను జయప్రదం చేయాలి

జఫర్‌గడ్, సెప్టెంబరు 19 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కూనూరు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించే క్రీడా ఎంపిక పోటీలను విజయవంతం చేయాలని మండల విద్యా నోడల్ అధికారి పర్వేజ్ కోరారు. మండలంలోని ఆయా పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్ల(పీడీ)లచే గురువారం కూనూరు హైస్కూల్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి పర్వేజ్ మాట్లాడుతూ ఈనెల 27, 28వ తేదీల్లో కూనూరు హైస్కూల్‌లో రెండు రోజుల పాటు పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో 14 నుంచి 17 ఏళ్ల బాలబాలికలు పాల్గొనేందుకు అర్హులన్నారు.

ఎస్‌జీఎఫ్ మండల అధ్యక్షుడిగా సాయికుమార్...

కాగా, కూనూరులో నిర్వహించిన సమావేశంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల శాఖ అధ్యక్షుడిగా ఆకుల సాయికుమార్ (కూనూరు, జడ్పీ హైస్కూల్ పీడీ), ఆర్గనైజింగ్ సెక్రటరీగా హరిత (తిమ్మంపేట హైస్కూల్ పీడీ) ఎన్నికైనట్లు నోడల్ అధికారి పర్వేజ్ తెలిపారు. ఈ సమావేశంలో ఆయా ఉన్నత పాఠశాలల పీడీలు రాము, బి.వంశీకృష్ణ, రాజు, దిలీప్, నరేశ్, సాంబరాజు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సోమనాథుడికి సాటి ఎవరూ లేరు..

పాలకుర్తి, సెప్టెంబరు 19 : తెలుగు విశ్వవిద్యాలయానికి బసవ పురాణం గ్రంథకర్త పాల్కూరికి సోమనాధుడు పేరు పెట్టడం సముచితం అని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాజేంద్ర ప్రకాష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పాల్కూరికి సోమనాధుడు స్మృతి వనాన్ని రాజేంద్ర ప్రకాష్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమనాధుడి సాటి గల కవి ఎవరు లేరని అన్నారు. సాహిత్య లోకంలో పాల్కూరికి లాంటి కవి లేరని స్పష్టం చేశారు. అందుకు ప్రభుత్వం తెలుగు యూనివర్సిటీకి సోమనాధుడు పేరు పెట్టడం సముచితం అన్నారు. సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ, దేవగిరి రామన్న, బచ్చు భుజంగరావు, గూడూరు లెనిన్ తదితరులు ఉన్నారు.